# శ్రీసన్నిధానం

సంపుటి 1  సంచిక 8

జూన్ 2022



# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## ఇందులో


3. సంపాదకీయం - సేవే ధ్యృక్పథంగా శ్రీసన్నిధానం చారిటబుల్ ట్రస్ట్
4. జేష్ఠ మాస వైభవం
5. మన దేవాలయాలు
6. రామానుజ సుధామాధురి దర్శన భాగ్యం-సౌభాగ్యం, సేవాఫలం-సాఫల్యం
7. శ్రీ నమ్మాళ్వార్ల భక్తివాహిని
9. విష్ణు పురాణ ప్రాశస్త్యము
10. ఆధ్యాత్మిక వార్తలు
11. బాలవిజ్ఞానం - సదాచారమే రక్ష
12. అభినందనలు



**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్

సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్

డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

శ్రీమాన్ అమరవాది వెంకటనర్సింహా చార్యులు




# ముఖచిత్ర పరిచయం

ప్రతి పండుగకు ఒక ప్రాధాన్యత, పరమార్థం దాగి ఉంది. ప్రకృతిలో నిరంతరం జరుగుతున్న మార్పులకు అనుగుణంగా మనం పండగలు చేసుకుంటున్నాము. అలాగే మనలో ఆధ్యాత్మిక స్ఫూర్తిని నింపి, భగవత్ భక్తికి అర్థాన్ని పరమార్థాన్ని నింపిన వారి పుట్టినరోజులను (తిరునక్షత్రాలను) వేడుకగా జరుపుకుంటున్నాము. అలాంటి వేడుకలు ఈ నెలలో ఉన్నాయి. భగవత్‌భక్తిని మనకు దివ్యప్రబంధాలను అందించిన నమ్మాళ్వారులవారు ఈనెలలో ఆవిర్భవించిన తిరునక్షత్రం వస్తోంది. పన్నిద్దరు ఆళ్వార్లు వివిధ ప్రాంతాలలో కొలువైన పెరుమాళ్లను కీర్తిస్తూ ప్రబంధాలను గానంచేశారు. ఆయా క్షేత్రాలు దివ్యదేశాలయ్యాయి. ఆళ్వార్లలో కొందరు నమ్మాళ్వారుకు ముందు మరికొందరు నమ్మాళ్వారుకు తరువాత ఆవతరించారు కాలగర్భంలో వారు రాసిన దివ్యప్రబంధాలు పూర్తిగా అందుబాటులోలేని వేళ నమ్మాళ్వార్లు మనపై దయతో మళ్లీ అనుగ్రహించారు. వారిని నిత్యం స్మరిస్తున్నా వారి తిరువాయ్‌మొజిని మరింత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని ఈ తిరునక్షత్రం చెబుతోంది. ముఖచిత్రం డింగరి సంపత్‌కుమార్ కుంచె నుంచి జాలు వారింది


**PUBLISHED BY :** డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్



చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 0878 2933323; 9502583323;



నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

# సంపాదకీయం

# సేవే దృక్పథంగా శ్రీసన్నిధానం చారిటబుల్ ట్రస్ట్ ఆవిర్భావం

నలుగురికి సహాయపడుదాం భారత జాతీయ స్ఫూర్తికి అంకితమవుదాము అన్న ఆలోచనతో, ఆధ్యాత్మిక భావనలను వెల్లివిరిసేలా ప్రయత్నాన్ని ప్రారంభించింది శ్రీసన్నిధానం. తొలుత శ్రీసన్నిధానం పేర ఒక స్వచ్ఛంధ సంస్థను ప్రారంభించ సంకల్పించాము. ఆలోచన వచ్చినదే తడవుగా శ్రీసన్నిధానం చారిటబుల్ ట్రస్ట్ పేరును రిజిస్టర్ చేయించాము. మా ఆలోచనలకు ఒక కార్యరూపం తీసుకవస్తూనే... ఈ ప్రస్తావన తీసుకురావడం జరిగింది.

ఒక మంచి పనిచేయాలంటే నలుగురి చేయూత కావాలి. మీరూ భాగస్వాములు కావచ్చు. మాతో చేయికలుపవచ్చు. భారత జాతీయ స్ఫూర్తిని, సంస్కృతీ సంప్రదాయ పరిరక్షణకు కంకణ బద్ధులైన వారుముందుకు రావచ్చు.

సంస్థ వేళ్లూనుకుని నలుగురికి సాయం చేసేలా నిలబడాలంటే లాభాపేక్ష లేకుండా ముందుకు వెళ్లాలి. అలాంటి లక్ష్యంతోనే డిజిటల్ రూపంలో పత్రికను ముందుగా మీ ముందుకు తీసుకువచ్చాము. ప్రింట్ కాపీ కావాలని అడిగిన వారికి మాత్రమే పత్రిక పంపించడం జరిగింది, దాతలు అందజేసిన మొత్తం ట్రస్ట్ ఎకౌంట్‌లో జమచేసేలా కార్యాచరణను రూపొందించి ఇందుకు గాను ట్రస్ట్ పేర బ్యాంకు ఖాతాను కూడా ప్రారంభించాము. ఇలా శ్రీ సన్నిధానం ట్రస్ట్ రూపకల్పన మార్గం సుగమం అయ్యింది ట్రస్టు ద్వారా ఎలాంటి కార్యక్రమాలు చేపడతారు? భవిష్యత్ కార్యాచరణ ఎలా ఉంటుంది? అనే సందేహం కలుగవచ్చు. పాఠక దేవుళ్ల ఆశీస్సులతో మేము చేస్తున్న ప్రతి కార్యక్రమం మీముందు ఉంచడం జరుగుతుంది. ప్రతినెలా పత్రికను చదువుతున్నవారికి సమాచారం అందుతుంది. విశిష్ఠ మహారాజ పోషకులు, మహారాజ పోషకులు, రాజ పోషకులు, మహా పోషకులు, పోషకులకు ఎప్పటికప్పుడు వారి ద్వారా చేపడుతున్న కార్యక్రమ వివరాలను వారి వారి ముందు ఉంచి తద్వారా వారిని ఆయా కార్యక్రమాలలో భాగస్వామ్యం చేయాలన్నదే మాసంకల్పం.

ఇక పత్రిక విషయానికి వస్తే ఆధ్యాత్మిక వార్తలకు సమాచారానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోంది. పాఠకులు తమతమ అభిప్రాయాలను శ్రీసన్నిధానం డాట్ ఒఆర్‌జి వెబ్ సైట్‌లో తెలుపవచ్చు, అన్ని అభిప్రాయాలను పత్రికలో ముద్రించడంతో పాటు ట్రస్ట్ నిర్వహణకు మీరిచ్చే ఆమోదయోగ్యమైన సూచనలను కూడా ఆచరించడానికి ముందుకు నడవడానికి శ్రీసన్నిధానం సిద్ధంగా ఉంది. ఇప్పటికి పత్రికను డిజిటల్ రూపంలో అందుకుంటున్నవారు ఐదువేల లోపు ఉన్నారు. ముద్రణ కాపీ అందుకుంటున్నవారు వందల్లో ఉన్నారు.

ముద్రణ వ్యయం ఎక్కువైనా పాఠకుల ఆదరణముందు శ్రీసన్నిధానంకు అది తక్కువే అనిపించింది. పాఠకుల అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యతగా గత నెల సంచికను కొందరికి పోస్టులో పంపడం జరిగింది. నెల నెలా ఈ సంఖ్యను పెంచుకుంటూ అందరినీ సంతృప్తి పరచాలన్న సంకల్పంతో ముందడుగు వేస్తున్నాం.

ఒక స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేయాలని సంకల్పం చిన్న విషయం కాదు. ఆదాయం లేకుండా కార్యాచరణకు ముందుకు వచ్చిన శ్రీసన్నిధానంను ఆదరించండి. జాతీయ స్ఫూర్తికి వూపిరి పోయండి. ఆచార్య నిష్ఠతో అడుగులో అడుగువేస్తూ ముందుకు వెళుతున్నాము. ఇది బుడిబుడి అడుగులే కావచ్చు కాని సంప్రదాయ సిరులు ఇంటింటా వెల్లివిరియాలని, ఈ మా ప్రయత్నం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించాలన్నది మాఅభిలాష! మాఅభిలాషకు అనుగుణంగా ఆస్ట్రేలియా, అమెరికా, బ్రిటన్, దుబాయ్ తదితర ప్రాంతాలనుంచి పాఠకుల ఆదరణ కనిపిస్తోంది. సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ దీక్ష తీసుకున్న శ్రీసన్నిధానం చేస్తున్న ఆధ్యాత్మిక సేవ ఇది. ఆధ్యాత్మిక భావాలు కల వారినందరిని ఒక వేదిక మీదకు తీసుకురావాలన్నది శ్రీసన్నిధానం సంకల్పం. శ్రీసన్నిధానం ఆలోచనను జాతీయస్ఫూర్తి, సంప్రదాయ పరిరక్షణేచ్ఛ ఉన్న ప్రతి ఒక్కరు స్వాగతించగలరనే భావనతో ముందడుగు వేస్తున్నాము.

**-చీఫ్ ఎడిటర్**

# జేష్ఠ మాస వైభవం



"మృగశిర కురిస్తే ముక్కారు పంటలు" అని సామెత! భూమిని, జీవరాసులని, సకల సృష్టిని సంపన్నం చేసేది తొలకరి చినుకే! ఎందుకంటే సకల వేదసారంగా అన్నం పరబ్రహ్మ స్వరూపం అని పెద్దలు చెప్పారు. "అన్నాత్ భవతి భూతాని పర్జన్యాదన్న సంభవః" అని భగవద్గీత వాక్కు! రోహిణి కార్తె ముగిసి మృగశిర కార్తె ప్రవేశం జేష్ఠ మాసంలో జరుగుతుంది. ఆరోజు బెల్లం లో ఇంగువను ఉంచి, ఆ గుళికలను గొంతులో వేసుకోవడం ఆచారం. శుభకార్యాలకు కూడా జేష్ట మాసం శ్రేష్ట మాసం అనే చెప్తారు. అయితే త్రిజేష్ఠలు పనికిరాదని కూడా శాస్త్రం చెప్తోంది. జేష్ఠ మాసంలో దేవాలయాల్లో ప్రత్యేక ఆరాధనలు జరుపుతారు తిరుమలలో జరిగే జేష్ట అభిషేకాలను అభిధేయక అభిషేకం అని అంటారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పూరి జగన్నాథ్ లో కూడా స్నానోత్సవం అని జరుపుతారు. తిరుమలలో పౌర్ణిమకు మూడు రోజుల ముందు నుండి జరిపే ఈ విశేష అభిషేక ఉత్సవాల్లో మలయప్పస్వామికి వజ్రకవచం, ముత్యాలకవచం, స్వర్ణకవచం ధరింపచేస్తారు. ప్రముఖ విష్ణ్వాలయాల్లో జేష్ఠాభిషేకాలు నిర్వహిస్తారు. జేష్ఠ పూర్ణిమను ఏరువాక పూర్ణిమగా పిలుస్తారు. దుక్కి దున్నే ప్రథమ కృషి కృత్యాన్ని గురించి వేదాల్లో పురాణాల్లో కూడా ప్రస్తావించారు.

ఏరువాక గురించి ఎన్నో పాటలు కథలు మనకు సాహిత్యంలో కనిపిస్తాయి. కొన్ని ప్రాంతాల్లో ఈరోజు వ్యవసాయ పనిముట్లను అలంకరించి పూజలు చేస్తారు. ఎద్దులకు పూజలను చేస్తారు ఇతర ప్రాంతాల్లో "కారుణి పబ్బము" అని ఉద్వృషభ యజ్ఞము అని వ్యవహరిస్తారు. "ఉద్వృషభ యజ్ఞాదయ ఉదీచ్యైః జ్యేష్ఠ మాసస్య పౌర్ణిమాస్యాం బలీ వర్ధాన్ అభ్యర్ఛ్య దావయంతి సోయం ఉద్వృషభ యజ్ఞః" అని ప్రమాణం చెప్పబడింది. కొన్ని ఉత్సవాల్లో ఆచరించే అంకురారోపణ వంటి కర్మలు కూడా వ్యవసాయ ప్రధానతను సూచిస్తాయి.

ఆర్ష సంస్కృతిలో శాస్త్రాల్లో విజ్ఞత, విజ్ఞానం సమపాళ్లలో కనిపిస్తుంది. ప్రకృతి మార్పులకు అనుగుణంగా మానవ జీవితాన్ని సుఖమయం చేసుకునే సంప్రదాయాలను వారు ఏర్పాటు చేసిపెట్టారు. వారి అపరిమిత శాస్త్ర జ్ఞానానికి ఉదాహరణగా హేతుబద్ధమైన చక్కని సంస్కృతిని నిర్మించి పెట్టారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఆధునిక పోకడలకు లోనైనా మన సాంప్రదాయ ఆచార వ్యవహారాలను మరువటం శ్రేయస్కరం కాదు. జగత్కారణ పరమాత్మతత్వం ఒకటే అయినప్పటికీ ప్రకృతి నిర్వాహక శక్తులను అనేక దేవతల రూపాలుగా మనం ఆరాధిస్తాం. కాల స్వరూపం అయిన పరమాత్మకు సకల దేవతలూ అవయవ రూపాలుగా పెద్దలు చెప్పారు. అందుకే మన శాస్త్రాల్లో కాలానుగుణంగా ఆయా దేవతలకు పూజా విధిని నిర్దేశించారు.

గ్రీష్మరుతువు మొదటి మాసం, సంవత్సరంలో మూడో మాసం జ్యేష్ఠ మాసం. ఈ మాసంలో జలానికి ప్రాధాన్యత ఉంది. ఇంటి పైన ఎత్తయిన ప్రదేశాల్లో మట్టి కంచుటిలో నీటిని ఉంచితే పుణ్యప్రదమని చెప్తారు. శ్రీ వైష్ణవ సంప్రదాయంలో కామ్య వ్రతాలు నిషిద్ధం ఏకాదశి ధనుర్మాస వ్రతం మాత్రమే ఆచరణీయం అని ఆచారం ఉంది. జ్యేష్ఠ మాసంలో శుద్ధ పాడ్యమిన కరవీర వ్రతం అనే భద్ర చతుష్టయి వ్రతాన్ని తదియ రోజు రంభా వ్రతం, త్రివిక్రమ వ్రతం ఆచరిస్తారు. కదిరి వృక్షానికి ఆరాధన చేసే రంభా వ్రతం పూర్వం పార్వతీదేవి ఆచరించి శివుని వివాహమాడింది అని వ్రత కథ. అలాగే చతుర్థినాడు గణేశ ఉపవాస వ్రతం సంకటహర చతుర్థిగా ఆచరిస్తారు. షష్టి రోజున అరణ్యక షష్ఠి అని అరణ్య గౌరీ వ్రతం వింధ్యవాసిని పూజలు చేయాలని శాస్త్రం చెబుతున్నది. దశమి రోజున దశపాపహర దశమి అని వ్యవహరించి విశేష దినంగా పాటిస్తారు. పాడ్యమి నుండి దశమి వరకు భగవంతుని అర్చించి పాపహర వ్రతంగా ఆచరిస్తారు **(మిగతా 8 పేజీలో)**

## మన దేవాలయాలు





# కోటి మొక్కులు కొండ స్వామికి

ఆరు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన ఆలయం జగిత్యాల జిల్లాలోని జగ్గాసాగర్ గ్రామంలో గుట్టపై వెలసిన కొండాస్వామి బ్రహ్మోత్సవాలు మే 11 నుండి 19 వరకు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం జరిగింది. యజ్ఞాచార్యులు శ్రీ చక్రపాణి మాధవాచార్యులు, శ్రీవర్ధనాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. బండలింగాపూర్, జగ్గాసాగర్ గ్రామాల అభివృద్ధి కమిటీలు స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు ప్రతి సంవత్సరం తేవడం సంప్రదాయంగా వస్తున్నది. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు తనయుడు టీఆర్ఎస్ రాష్ట్ర యువనేత డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బద్దం సుగుణ-రాజేశ్, పిడుగు తిరుపతిరెడ్డి, మోహన్ రెడ్డి, పుల్ల జగన్ గౌడ్, కోరం నరేశ్, రాజేందర్, శ్రీనివాస్, శ్రీ మన్నారాయణ దీక్షాపరులు, నాయకులు, దేవాలయ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. మండలంలోని ఆయా గ్రామాలలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయ మండపంలో సామూహిక పూజలు నిర్వహించారు. దేవాలయ, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసారు. గ్రామంలోని పురవీధుల గుండా పల్లకీ సేవ నిర్వహించగా మహిళలు మంగళహారతులతో కొండా స్వామికి స్వాగతం పలికారు. జగిత్యాల, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ మొదలైన జిల్లాలనుండి వేలాదిగా భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. 18న రథోత్సవం చివరి రోజు చక్రస్నానంతో ఉత్సవాలు ముగిసాయి.







## మీరూ

**భాగస్వాములు కండి!!**

మీ గ్రామంలోని ఆలయం విషయాలను విశేషాలను శ్రీసన్నిధానం పాఠకులతో పంచుకోండి. ఆలయాల వైభవాలను వెల్లడించడానికి చక్కని ఫొటోలు అందిస్తూ మీభావస్ఫూర్తితో వివరాలు మాకు అందజేయండి.

**పంపవలసిన వాట్సాప్ నంబర్**
**9502583323**

# శ్రీరామానుజ సుధామాధురి



## దర్శన భాగ్యం- సౌభాగ్యం, సేవాఫలం- సాఫల్యం

విశ్వాసం అనే సోపానాలు ఎక్కగలిగినప్పుడే భగవత్ గుణానుభవం అనే భవనాన్ని చేరుకోగలుగుతారు. ఆ దివ్యపథంలో పయనించినప్పుడే ఉన్నత స్థానాన్ని చేర గలుగుతాము. అక్కడి నుండి సమస్త సత్యము మనకు గోచరిస్తుంది. జీవిత పరమార్థము స్పష్టం అవుతుంది. లోకహితం, స్వహితం రెండు లభిస్తాయి. లౌకిక అలౌకిక ప్రయోజనాలు సిద్ధిస్తాయి. అటువంటి ఉన్నత లక్ష్యసిద్ధి కొరకు మన వైదిక ధర్మం 'ఆచార్య సంబంధం' అనే గొప్ప సంస్కృతిని ఏర్పరిచింది. అటువంటి ఉత్కృష్టమైన ఆచార్య స్థానమందు పరమాత్ముడే అవతరించాడు. శ్రీకృష్ణ పరమాత్మగా, నర నారాయణులుగా, వ్యాస పరాశరులుగా తాను అవతరించాడు. వైదిక ధర్మాచరణము వక్ర మార్గాలలో పయనించ కుండా ఆళ్వారులు ఆచార్యులు అవతరించారు. ఆళ్వారు శ్రీసూక్తి సారమైన ద్రావిడ వేదం, ఆర్ష ఋషి ప్రకాశిత సంస్కృత వేదం రెండు నేత్రాలుగాగల ఉభయ వేదాంత వైభవాన్ని శ్రీభగవద్రామానుజ మార్గం ప్రకాశం చేసింది. విభేదాలు, వివక్షతలు లేని సర్వమానవ హితైషిగా శ్రీరామానుజ మార్గం గుర్తించి, అనుసరించబడింది. ఉజ్జీవించాలనుకునేవారికి మన పెద్దలు మూడు నిష్ఠలు కలిగి ఉండాలని ఆదేశించారు. అవి ప్రథమ, మధ్యమ, చరమ పర్వ నిష్ఠలు. భగవంతుడే ఉపాయం అని నమ్మి సర్వేశ్వరుని ఆశ్రయించటం మొదటిది. భాగవత శరణాగతి ప్రధానంగా భావించడం రెండవది. చిట్టచివరి ఉపాయం ఆచార్యుడే సర్వస్వం అని భావించటం. అన్ని భగవత్ ప్రాప్తి సాధక మార్గాలలోకి ఆచార్య అభిమానం అనే నిష్ఠను మించినది మరొకటి లేదు. అటువంటి పరమాచార్యులు శ్రీ భగవద్ రామానుజాచార్యులు మాత్రమే అని చరమపర్వనిష్ఠ రహస్యాలను మన పూర్వాచార్యులు గ్రంథాలుగా అనుగ్రహించారు. ఆచార్యులు జ్ఞాన పూర్ణుడై ఉండాలి. వేద మార్గ సహేతుక సిద్ధాంతాను వర్తులై ఉండాలి. కారణజన్ములు సకల మానవ ఉజ్జీవన అనురక్తులై ఉండాలి. వారే జగద్గురువులుగా జగదాచార్యులుగా నిర్ధారించి ఆరాధింపబడతారు. సృష్ట్యాది నుండి ఎందరో భక్తులు పరమ సాధువులు ఆళ్వారులు ఆచార్యులు అవతరించారు. వారంతా భగవత్ ప్రాప్తి మార్గాన్ని వారి వారి పరమోత్కృష్ట విధానాలతో ఉపదేశించారు, ఉద్ధరించారు. అటువంటి ప్రత్యేక లక్షణాలకు మించిన కళ్యాణ గుణాలు పోతపోసిన పరమాచార్యులు లక్ష్మణ మునులు శ్రీ భగవద్ రామానుజాచార్యులు. అందుకే

"సత్యం సత్యం పునః సత్యం యతి రాజో జగద్గురుః
స ఏవ సర్వలోకానాం ఉద్ధర్తా నాస్తి సంశయః" అని కీర్తించబడ్డారు. వేల మందిని దిద్దుబాటు చేసి వేల సంవత్సరాలు అయినా వేనోళ్ళ స్తుతింపబడు వాత్సల్య పూర్ణులు శ్రీ రామానుజాచార్యులు. అనేక మంది శిష్యులను జ్ఞాన ప్రకాశులు గావించిన జగదాచార్యులను ఆ శిష్యులే కంటికి రెప్పలా కాపాడుకున్నారు.

భగవంతుడు పర,వ్యూహ,విభవ,అంతర్యామి అర్చ్యావతా రాలుగా పంచ స్వరూపాల్లో ఉన్ననూ, సులభుడై ఈ లోకమందు అందరినీ అనుగ్రహించే స్వరూపం అర్చారూపమే! పరమాత్ముడు అనేక దివ్యదేశాలలో అర్చా స్వరూపుడై మహత్తరమైన లీలలను ప్రదర్శిస్తూ కొలువై ఉన్నాడు. భగవత్ తత్త్వాన్ని జ్ఞాన భక్తులనే నేత్రాలతో దర్శించిన ఆళ్వార్లు దివ్యదేశాల యందలి అర్చామూర్తి వైభవాన్ని స్తుతించి ప్రకాశింప చేశారు.

ఆ 108 దివ్య దేశాల స్ఫూర్తి శ్రీ భగవద్ రామానుజాచార్య దివ్య జీవన గతికి మూర్తిమత్వాన్ని కలిగించింది. అంటే ఆయా దివ్యదేశాల విజయయాత్రలో శ్రీ రామానుజాచార్యులు ఏర్పరిచిన ఆరాధన వైభవం, పెరుమాళ్ళ అనుగ్రహ లీలా ప్రకాశం కనిపిస్తుంది. భగవంతుడు భూలోక వైకుంఠాలయిన దివ్య దేశాలన్నింటి మహాత్మ్యాలను చాపలా చుట్టి భగవద్ రామానుజా చార్యుల దివ్య దేహంపై పరిచారట! అంటే ఒక్క భగవద్ రామానుజాచార్యుల దర్శనం గావిస్తే, వారిని ఆరాధిస్తే 108 దివ్య దేశ పెరుమాళ్ళను దర్శించి సేవించిన ఫలం లభిస్తుంది అని పెద్దలు ప్రవచిస్తారు. "మారన్ పొన్నడి" శఠగోపన్ పొన్నడి అని ఆళ్వార్ల అవయవిగా భావించే నమ్మాళ్వార్‌ల పాద స్థానీయులుగా శ్రీ రామానుజాచార్యులను భావిస్తారు. విలువైన పవిత్రమైన శుభప్రదమైన బంగారు పాదాలుగా సమన్వయం చేస్తారు. అనగా శ్రీ రామానుజాచార్యులను ఆరాధిస్తే ఆళ్వార్లందరినీ ఆరాధించి నట్లుగా భావిస్తారు. **(మిగతా 8 పేజీలో)**

# శ్రీ నమ్మాళ్వార్ల భక్తివాహిని

“నాలాయిరం మనకు ప్రసాదించి పన్నిద్దరు ఆళ్వార్లు సాయించిన దివ్యప్రబంధాన్ని అనుగ్రహించినది నమ్మాళ్వారు. వారి జన్మదినం తిరునక్షత్ర ప్రమాణాలను అనుసరించి మనకు జూన్ 12న వస్తోంది. నమ్మాళ్వారుకు ముందు ఉద్భవించిన ఆళ్వారులు, వారి వైభవసారాన్ని గ్రహించేలా చేయడంతో పాటు భవిష్యత్ ఆచార్యులు రామానుజుల వారే అంటూ వారు దివ్యమంగళ స్వరూపాన్ని మూర్తిగా అనుగ్రహించారు. గతాన్ని భవిష్యత్తును తెలియజేసిన నమ్మాళ్వారు వైభవాన్ని మనం స్మరించుకుంటే పన్నిద్దరు ఆళ్వారులను స్మరించుకున్నట్టే. మూర్తీభవించిన వారి అర్చామూర్తిని శ్రీవైష్ణవ తిరుమాళిగలలోని పెరుమాళ్ల సన్నిధిలో ఉంచి ఆరాధించి పూర్వాచార్యులను నిత్యం పూజించి, ఆరాధించి తరించాలి. పెరుమాళ్ల కోవెలలో స్వామి వారిని దర్శించినప్పుడు శఠగోపంగా మనను నమ్మాళ్వార్లు నిత్యం ఆశీర్వదిస్తున్నాడని తెలియజెప్పె ప్రయత్నమే ఈ వ్యాసం అంతరార్థం. నిత్యం అనుసంధానం “పూరువాచారియర్గల్ పోదం అనుట్టానంగళ్” అంటూ అను నిత్యం పెరుమాళ్ల సన్నిధిలో ఉపదేశ రత్నమాలలోని శాత్రు పాశురాలను అనుసంధానం చేస్తూ వారిని స్మరించుకోవడమే కాదు వాటి అంతరార్థమైన భావాన్ని తెలిపి రేపటితరానికి నాలాయిరం సాయించేందుకు శ్రీవైష్ణవ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది.”



మాతృభాష మాధుర్యానికి పట్టంగట్టిన పరభక్తి, పరజ్ఞాన పరమభక్తి కవివరేణ్యులు శ్రీనమ్మాళ్వార్లు. శ్రీ నమ్మాళ్వార్ల భక్తి వాహిని శ్రీ వైష్ణవశ్రీని ప్రకాశవంతం చేసింది. ద్రావిడ వాఙ్మయానికి కృష్ణతృష్ణ, నాయకాభక్తి, వేదసార వైదుష్యం అనే జాతి రత్నాలద్దిన సహజ కవులు. వైరాగ్య శోభితులు వకుళ మాలా భూషితులు. కారణజన్ములై సేనా నాయకులు (విశ్వక్సేనులు) ప్రపన్న జన కూటస్థులుగా (భక్తజన నాయకులుగా) శ్రీ నమ్మాళ్వార్లుగా ఉదయించారు. కలియుగం ఆరంభంలో ఉద్భవించిన శ్రీ నమ్మాళ్వార్లు కలివైరి సూరులుగా స్తుతించబడ్డారు. పుట్టిన క్షణం నుంచే ఆశ్చర్య చేష్టితుడైనందు వలన తల్లిదండ్రులు చింతించారు. ఆదినాథ పెరుమాళ్ళ రక్షణలో చింతచెట్టు తొర్రలో చిన్ననాడే ప్రవేశించారు. మధుర భక్తితో నిండిన హృదయాన్ని విప్పి సహజ ద్రావిడ భాషలో పాశురాలు పాడారు. “ఊరు నాడు ఉలగం” అన్నట్లు స్థానికులు, ప్రాంతీయులు, లోకంలోని వారందరూ ఆ పాశురాలు విని తరించారు. ఆదినాథ పెరుమాళ్‌చే ఇయ్యబడిన వకుళ మాలను ధరించారు. లౌకిక జ్ఞానమైన శఠ వాయు ప్రభావానికి లోనుకాకుండా శఠగోపయోగిగా కీర్తించబడ్డారు. పర మతాలను జయించే జ్ఞాన స్ఫూర్తి గలిగి పరాంకుశ దాసులుగా పేరుగాంచారు. అనన్య భక్తి తో పూర్ణులైన భగవత్ ప్రాప్తి మార్గ ద్రష్టలు శ్రీ నమ్మాళ్వార్లు. ఆళ్వారులలో ప్రధానులుగా, ఆచార్యులలో ప్రథములుగా ఉన్నారు.

పరమ ఋషులు అష్టాంగాది యోగ మార్గంతో, తపోబలంతో అపౌరుషేయ మైన వేద సంపదను వెలువరించారు. ఆ వేదసారాన్ని మధురభక్తి శరణాగతితో తాను అనుభూతిని పొంది ద్రావిడ ప్రబంధాలుగా అనుగ్రహించారు నమ్మాళ్వార్లు. సాక్షాత్ జగత్ కారణుడైన పరమాత్మ గరుడ వాహనారూఢుడై వచ్చి దర్శనమిచ్చాడట! పరవశించిన శ్రీ నమ్మాళ్వార్లు తాను ఉన్నచోటి నుండే 38 దివ్యదేశాల పెరుమాళ్లను దర్శించి, ఆయా దివ్యదేశాల పెరుమాళ్ళ వైభవాన్ని పాశురాలుగా గానం చేశారు. అందుకే

“వకుళా భరణం వందే జగదాభరణం మునిం

యః శ్రుతేరుత్తరం భాగం చక్రే ద్రావిడ భాషయా” అని పెద్దలు స్తుతిస్తారు. భగవంతునికి భక్తులతో కలిపే దివ్య దేశాలు అంటే మిక్కిలి ప్రీతి. భగవద్దర్శనం అనుగ్రహాలను ప్రసాదించేవి దివ్య దేశాలే కనుక భక్తులకు ప్రీతి ప్రదమైనవి. అట్లే భగవంతుని శరణాగతి చేసే భాగవతులంటే, సర్వులను భగవత్ ప్రాప్తి మార్గానికి మళ్ళించే జ్ఞానులంటే భగవంతునికి ఎంతో ప్రేమ. అందుకే శ్రీ నమ్మాళ్వార్లంటే పెరుమాళ్లకు ఎంతో ప్రీతి ప్రదం అని మన పూర్వాచార్యులు స్తుతిస్తారు. అందుకే పెరియ పెరుమాళ్ (శ్రీరంగనాథుడు) వీరిని “నమ్ముడయ ఆళ్వార్” అంటే నమ్మాళ్వార్ (మన ఆళ్వార్) అని సంబోధించారట! అలాగే భగవతి శరణాగతి చేసే భాగవతులు అంటే శ్రీనమ్మాళ్వార్‌లకు **(మిగతా 8వ పేజీలో)**

## జేష్ఠ మాస వైభవం

**(4 పేజీ తరువాయి)** "దశహరా దశాశ్వమేధే స్నానం ఇత ఆరభ్య దశమి పర్యంతం" అని పంచాంగాల్లో రాయబడి ఉంటుంది. నదీ స్నానం విశేషమైనది అని పెద్దలు చెప్తారు.

దశమి రోజున కొన్ని ప్రాంతాల్లో గంగోత్సవం జరిపి ఆరాధనలు నిర్వహిస్తారు. "నమో భగవతే దశపాపహరాయై" అని ఈనాడు అమ్మవారిని ఆరాధిస్తారు. పది రకాల పూలతో పూజించి, పది రకాల నైవేద్యాలు చేసి వ్రతకథ శ్రవణం చేయడము అనేది ఆచారం. జ్యేష్ఠ మాస ఏకాదశి నియమం పుణ్యప్రదమైనది. ప్రతి సంవత్సరం శుక్ల బహుళములుగా 24 ఏకాదశులు వస్తాయి. ప్రతి ఏకాదశి ఒక్కో విశేషాన్ని కలిగి ఉంటుంది. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశిని నిర్జల ఏకాదశి అంటారు. వేదవ్యాసుల వారి ఉపదేశంగా జలాన్నికూడా (ఆచమనంకు తప్ప) స్వీకరించ కుండా ఏకాదశి ఆచరిస్తే సంవత్సరాంతం అన్ని ఏకాదశులు ఉపవాసం చేసిన ఫలం దక్కుతుంది అని పాండవులలోభీమునికి చెప్పినట్లుగా భారత కథ ఉంది నిర్జల ఏకాదశి ఆచరణ గురించి అనేక విశేషాలు గ్రంథాల్లో చెప్పబడ్డాయి. ద్వాదశిని రామలక్ష్మణ ద్వాదశి అని శ్రీ శంకరాచార్యుల కైలాస గమనం ఈరోజే అని చెప్పబడింది. జ్యేష్ఠ శుద్ధ పూర్ణిమ ఏరువాక పూర్ణిమగా చెప్పబడింది. ఈరోజు వటసావిత్రి పూర్ణిమగా కూడా వ్యవహరిస్తారు. ఈ వ్రతానికి సంబంధించి ఎన్నో కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. జ్యేష్ఠ మాసం జల ప్రాధాన్యత కలిగింది. విష్ణు ఆలయాల్లో శివాలయాల్లో కూడా జేష్ఠా అభిషేకాలు, అమ్మవారి ఉత్సవాలు వైభవంగా జరుపుతారు.

### దర్శన భాగ్యం-సౌభాగ్యం, సేవాఫలం-సాఫల్యం

**(6 పేజీ తరువాయి)** అట్లే అందరికీ ఉత్తారకాచార్యులైన భగవద్ రామానుజాచార్యలకు గురు పరంపరలోని (తిరుముడి) ముందున్న ఆచార్యులు, (తిరువడి) తర్వాతి ఆచార్యులు అవయవ భాగాలుగా సమన్వయం చేస్తారు. అనగా శ్రీరామానుజాచార్యులను స్మరిస్తే, ఆరాధిస్తే గురుపరంపరా చార్యుల నందరినీ ఆరాధించిన విశేషఫలంగా పెద్దలు భావిస్తారు. శ్రీ వైష్ణవ సంప్రదాయంలో ప్రధానమైనవి మూడు అంశాలు అవి ఆళ్వారులు, ఆచార్యులు, దివ్యదేశాలు ఈ మూడింటి స్ఫూర్తిని శ్రీ భగవద్ రామానుజాచార్యుల దివ్యతిరుమేని యందు మన పూర్వాచార్యులు సమన్వయీ కరించారు. అందుకే జగదాచార్యుల నామస్మరణ, ఆరాధన, కైంకర్యం, అనుసరణ సకల శుభదాయకాలు.

# శ్రీ నమ్మాళ్వార్ల భక్తివాహిని

**(7వ పేజీ తరువాయి)** కూడా ప్రీతి ఎక్కువ. అందుకే భాగవత వైభవాన్ని, భవిష్యత్ ఆచార్యులైన శ్రీరామానుజా చార్యుల వైభవాన్ని కూడా " పొలిగ పొలిగ" ఇత్యాది పాశురాల్లో గానం చేశారు. భగవంతునికి ప్రీతిపాత్రమైన శ్రీ నమ్మాళ్వార్ల తిరుమేని వైభవాన్ని మన పెద్దలు సమన్వయం చేస్తారు. 10 మంది ఆళ్వారుల స్వరూపంగా శ్రీ నమ్మాళ్వార్ల దివ్య శరీరాన్ని అవయవిగా అభివర్ణిస్తారు. నమ్మాళ్వార్లు భవిష్యత్ సిద్ధాంత ప్రవర్తకులుగా శ్రీ రామానుజాచార్యుల అవతరణ సంకల్పం గావించారు. శిష్యులకు వారి దివ్య మూర్తిని ప్రసాదించారు. శ్రీనాథమునులకు ప్రసన్నులై నాలాయిర దివ్య ప్రబంధాలను అనుగ్రహించారు.

" యో మునిర్నాయికా భావ మాత్మ న్యారోప్య చక్రిణః
హరిం ప్రాప శఠారాతిం తం వందే భగవత్ కవిం" అని నాయిక భావాన్ని తనయందారోపించుకొని కవితలల్లిన భగవత్ కవి. మధుర కవి ఆళ్వార్లు సాయించిన కణ్ణిన్నుం శిరుత్తాంబువు. స్తుతితో కృష్ణ లీలా తృష్ణతో నమ్మాళ్వార్లు పరవశులవుతారట!.శ్రీ కృష్ణ తత్వ మాధుర్యాన్ని తాను గ్రోలి గానం చేసి ఆ అమృతాన్ని అందరికీ పంచిన 'వకుళ భూషణ నాయకి' శ్రీ నమ్మాళ్వార్లు.తాను దర్శించిన ముక్తి మార్గాన్ని, అర్చిర్ పథాన్ని మనకనుగ్రహించారు. శ్రీ విష్వక్సేనులు సూత్ర వతీ సహితంగా చిలుకల రూపంలో వచ్చి శ్రీ నమ్మాళ్వార్ ల చెవిలో ద్వయ మంత్రాన్ని ఉపదేశించారట! ప్రపన్న జన తారకమై ద్వయ మంత్రం వారినుంచే అందరికీ అనుగ్రహించబడింది.

"ఉండో వైగాశి విశాకత్తుక్కొప్పారునాళ్ ఉండో" అని శ్రీ వర వర మునులు ఉపదేశ రత్నమాల లో శ్రీ నమ్మాళ్వార్ల వైభవాన్ని తెలిపారు. విశాఖ నక్షత్రంతో కూడిన వైశాఖ మాసం కంటే గొప్ప రోజు ఉందా? అని కొనియాడుతారు. వైశాఖ మాసం, విశాఖ నక్షత్రం, పూర్ణిమ తిథి శ్రీ నమ్మాళ్వార్ల తిర్ నక్షత్రం. ద్రావిడ వేదానికి శ్రీ వైష్ణవ సిద్ధాంతానికి మూలపురుషులు శ్రీనమ్మాళ్వార్లు. శ్రీ వైష్ణవ దేవాలయాల్లో ప్రపన్నుల గృహాల్లో ఈ ఉత్సవాన్ని విశేషంగా ఆచరిస్తారు. దివ్య పురుషులైన వారి ఇతిహాస వైభవాన్ని మరింతగా అన్వేషించి సేవించుకుందాం!.

# విష్ణు పురాణ ప్రాశస్త్యము



చించాపట్ల గోమటం
జగన్మోహనాచార్యులు

**ఖగోళశాస్త్ర రహస్యాలు, కాలమానం, గణిత శాస్త్ర విషయం ఇలా అన్ని విషయాల ప్రస్తావన పురాణాల్లో మనకు కనిపిస్తుంది. పాశ్చాత్యులు మేము కనిపెట్టాం అని చెప్పుకుంటున్నవన్నీ పురాణాల్లో ఉన్నాయి. భారతీయ విజ్ఞానానికి అవి ఆధారాలు. అష్టాదశ పురాణాలలో విష్ణుపురాణ ప్రాశస్త్యము గురించి వర్ణించతరము కాదు. కాలమానానికి సంబంధించినదే 'కల్పము (4.32 బిలియన్ సంవత్సరాలు) అనగా విశ్వం ఆవిర్భావం, సృష్టి స్థితి లయలకు సంబంధించిన కాల ప్రమాణమే ఇది. విష్ణుపురాణంలోనే తొలుత దీని ప్రస్తావన కనిపిస్తుంది. అలాగే సృష్టిక్రమం, కొలమానానికి సంబంధించిన అంశాలు కూడా మొదట ఇందులోనే చెప్పబడ్డాయి. వేదాల సారం విష్ణుపురాణములో సుస్పష్టంగా చెప్పబడింది. నారాణతత్వాన్ని తెలియజెప్పినది కనుక విష్ణుపురాణమైనది.**

యస్మిన్ కల్పేతు యత్ప్రోక్తం పురాణం బ్రహ్మణాపురా
తస్య తస్య తు మహాత్మ్యం తత్స్వరూపేణ వర్ణ్యతే (మత్స్య) పురాణాలను తామస, రాజస, సాత్విక పురాణాలుగా వర్గీకరించారు. వివిధ కల్పాలలో చతుర్ముఖ బ్రహ్మ వివిధ గుణాలచేత ఆవరింపబడి ఉంటాడు. బ్రహ్మ ఏకల్పంలో ఏగుణముచే ప్రభావితుడై ఉంటాడో ఆగుణ ప్రాధాన్యము గల పురాణములు ఆ కల్పంలో ఆవిర్భవించాయి, బ్రహ్మకు తామసగుణము ప్రధానముగాగల కాలములో తామస గుణము ప్రధానముగా కల పురాణములు చెప్పడినాయి. రజోగుణ ప్రధానము కల కల్పములలో చెప్పబడినాయి. రాజసపురాణములు. సాత్విక కల్పములలో చెప్పబడిన పురాణములు సాత్వికపురాణములు. పురాణములు మూడు విధములని, విష్ణుపురాణము సాత్విక పురాణమని మత్స్య పురాణమున చెప్పబడినది. పురాణముల వర్గీకరణను గురించి మరే పురాణము దీనికి విరుద్ధముగా చెప్పుట లేదు. 'సత్వాత్ సంజాయతే జ్ఞానం' అని చెప్పబడుట వలన సత్వగుణ ప్రధానమగు విష్ణు పురాణము మోక్ష హేతువగు తత్వజ్ఞానాన్ని కలిగించ గలిగింది. కాబట్టి ఉత్కృష్టమైనది.

పరాశరుడు తన తండ్రి అగు శక్తి రాక్షసులచే వధింపబడ్డాడని తెలిసి విచారమును పొందిన వాడై రాక్షస నాశనము నకు పూనుకొని యాగము చేయుచు సంహారమును ప్రారంభించాడు. తాత అగు వసిష్ఠుడు రాక్షసనాశనమును మానుకొనమ్మని చెప్పగా, కోపములో ఉన్నా తనమాటను గౌరవించినందున దివ్యజ్ఞానమును ప్రసాదించాడు. పులస్త్యుడును తన వంశనాశనమును ఆపివేసినందున 'పురాణ కర్తవు అవుతావు' అని వరాన్ని ఇచ్చాడు. ఇట్లు ఇరువురి వరప్రభావమువలన కలిగిన దివ్యజ్ఞానము గల వాడగుటచే అతనిపురాణములో దోషములుండవు. 'తత్ర పులస్త్య వశిష్ఠ వర ప్రదాన లబ్ద పరదేవతా పారమార్థ జ్ఞానవతో భగవతః పరాశరాత్స్వాగత వేదార్థోపబృంహణ మిచ్ఛ న్మైత్రేయః పరిపప్రచ్ఛ' అను వాక్యముచే ఈ అంశము నిరూపించబడినది. ఈ విషయము శ్రీ భాష్యమున సూచించబడినది. విష్ణుపురాణము గొప్ప ప్రసిద్ధి, ప్రాచుర్యముకలది.

'ధర్మశాస్త్రే మానవస్యైవ వ్యాకరణేషు పాణినీయ ఏవచ స్వజాతీయ ప్రబన్దేభ్యః ప్రకర్షతిశయాప్నోతుం శక్యతే, తత ఏవ ప్రసిద్ధి ప్రాచుర్యాత్, కౌర్మాదేరివ నష్టకోశత్వ శంకాదూరోత్సారితా, అనతి విస్తరత్వాచ్చ ప్రక్షేప శంకా నావతరతి అన్య పరోక్తి ప్రసిద్ధ పరిగ్రహాతిశయం చేదం (శ్రుత ప్రకాశిక) ధర్మశాస్త్రములలో మనుధర్మశాస్త్రము, వ్యాకరణము లలో పాణినీయముల వలె పురాణములలో విష్ణుపురాణము పరిగ్రహ అతిశయము కలది. భారతదేశమందలి అందరు పండితులచే సాదరముగా గ్రహింపబడి బహుళ వ్యాప్తిలో నున్నది. గాధాసప్తశతి అను ప్రాకృత ముక్త కావ్యముకూడ విష్ణుపురాణమును పేర్కొన్నది. ఇతర శాస్త్రములయందును, కావ్యములలోను సందర్భోచితముగా విష్ణుపురాణము ప్రస్తావింపబడిన ప్రాశస్త్యాన్ని కలిగియున్నది. కూర్మ పురాణం వంటి కొన్ని పురాణములు కొంతభాగము నష్టమైనవి. పూర్తిగా లభ్యమగుట లేదు. స్కాంధ పురాణాదుల వలే విస్తృతమైనదిగా ఉండుట వలన వానిలో అనేక ప్రక్షిప్తముల (సంక్షిప్తం) ప్రసక్తి ఏర్పడినది. అటువంటి ఖిల (తొలగించిన) భాగముల మరియు ప్రక్షిప్తములు లేనిది విష్ణు పురాణము. ఇతర పురాణములలో చెప్పబడిన తత్తద్దేవతా పరత్వము అనేది వేద విరుద్ధము. కాని విష్ణుపురాణములో చెప్పబడిన నారాయణపరత్వము వేద ప్రతిపాదితము, **(మిగతా 12వ పేజీలో)**

# వాడవాడలా శ్రీరామానుజ జయంతి వేడుకలు

## ఇందూరు చక్రం గుడిలో









కోదాడలో ప్రత్యేక అలంకరణ

భగవద్రామానుజా చార్యులు వారి తిరునక్షత్ర మహోత్సవం ఉభయ తెలుగు రాష్ట్రాలలో వైభవంగా జరిగింది. ఇందూరు చక్రంగుడిలో ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించారు. రామానుజుల వారి ఉత్సవ మూర్తిని ఊరేగించారు. మూడురోజుల పాటు ఉభయ వేదాంత పండితులు శ్రీవర్ధనాచార్యులు రామానుజులవారి జీవిత విశేషాలపై ప్రవచన గోష్ఠి నిర్వహించారని శ్రీవైష్ణవ సంఘం కార్యదర్శి కందాళై నాగరాజు ఆచార్యవారు ఒక ప్రకటనలో తెలిపారు.



### అనాదిగా వస్తున్న ఆచారం...

సనాతన సంప్రదాయానికి దేశంలో కేరళలో ఇప్పటికీ గౌరవం ఇస్తున్న దృశ్యమిది. నిత్య విమానరాకపోకలతో రద్దీగా ఉండే అంతర్జాతీయ విమానాశ్రయం రాజా బలరామవర్మ కాలం అంటే నుంచీ సంవత్సరంలో రెండు రోజులు కొద్ది సమయం మూసివేస్తారు. అనాదిగా ఈ స్థలంనుంచే అనంత పద్మనాభుని సేవవెళుతుంది. విమానాశ్రయం ఏర్పడినతరువాత కూడా 1932 నుంచి అదే సంప్రదాయం కొనసాగుతోంది. ఇటీవలి దృశ్యమిది.

# పాఠకుల స్పందనలు

ప్రతి నెలా శ్రీసన్నిదానం ఆన్‌లైన్‌లో చదువుతున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. తమకు కావాల్సిన సమాచారం ఉందని అభినందించేవారె ఎక్కువ. కొద్ది మంది పాఠకుల అభిప్రాయాలు సంక్షిప్తంగా...

మీ మా ,"సన్నిదానం" కోసం ఎదురుచూస్తున్నాము. ఎల్ఎన్ మలకలపల్లి వి రావు, విజయవాడ

ధార్మిక విషయాలలో విశ్వసిస్తున్నాను. ఎం.సంపత్ కుమార్, కెకెనగర్ చెన్నై

చదవడానికి వీలుగా ఒకే ఫాంట్ ఉంటే బాగుంటుంది. వై లక్ష్మీ రాజగోపాలరావు,, కాకినాడ

ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పెంపొందించే శ్రీసన్నిధానం - సముద్రాల విజయ్ కుమార్, కరీంనగర్

చాలా బాగుంది. మండల వెంకట రమేష్, ముతలూరు, గ్రామం, కర్నూలు

దయచేసి ఈ సంచికను నా చిరునామాకు పంపండి ఎన్‌సిహెచ్ మురళీ కృష్ణమా చార్యులు, దమ్మాయిగూడ, హైదరాబాద్

ధన్యవాదాలు. రంజిత్ కుమార్ గోవర్ధన, పీర్జాదిగూడ హైదరాబాద్

-నంద్యాల మురళీ కృష్ణ కిషోర్, శంకరపురం, కడప.

శ్రీసన్నిధానం పత్రిక చాల భాగుంది వసుందర, వరంగల్

## పాఠకులకు ముఖ్య గమనిక

**శ్రీసన్నిధానం పత్రిక చదివి పాఠకులు తమ అభిప్రాయాలు స్వేచ్ఛగా తెలుపడంతో పాటు మాకూ ప్రతినెలా పత్రిక అందించండి. అంటూ చిరునామాలు అందించేవారి సంఖ్య దినదిన ప్రవర్ధమానం అవుతోంది. మేము సైతం అనుకున్న వారంతా వెబ్‌పేజీలో వివరాలు నమోదు చేసుకోవాలి.**

# సదాచారమే రక్ష!

ఎన్నో పురాణ కథలు మనకి మంచి మార్గాలను బోధించి, నిదర్శనంగా చూపిస్తాయి. అలాంటి ఒక మంచి కథ అంబరీషుని వృత్తాంతము.

పరమ విష్ణు భక్తుడైన అంబరీష మహారాజు మీద భగవంతునికి ఎంతో ప్రీతి. శ్రీమన్నారాయణుడు తనకు ఇష్టమైన భక్తుల రక్షణకు సుదర్శన చక్రాన్ని వారి దగ్గరే ఉంచుతాడట! అంబరీషుడు నిష్ఠతో ఏకాదశి వ్రతం చేసేవాడు. ఏకాదశి ఉపవాసం చేసి ద్వాదశి అతిథులకు బ్రాహ్మణులకు భోజనాలు పెట్టి ద్వాదశి ముగియక ముందే తాను ప్రసాదం స్వీకరించి, "ద్వాదశి పారణ" ను ఆచరించాలి అనేది నియమం.

ఒకరోజు ద్వాదశినాడు దుర్వాస మహర్షి అంబరీషుని వద్దకు వచ్చాడు. దుర్వాసుడు కొంచెం కోపిష్టి అయినా శక్తిమంతుడైన మహర్షి. తన ఇంటికి వచ్చిన ఋషిని సాదరంగా ఆహ్వానించి భోజన సంతర్పణ స్వీకరించమని రాజు ప్రార్థించాడు. దూర్వాసుడు సరేనని స్నానాదికాలు ముగించుకుని వస్తాను అని బయటకు వెళ్లాడు. సమయం ఆసన్నమైంది బ్రాహ్మణోత్తములు అందరూ వచ్చారు అంబరీషుడు ఆరాధన ముగించుకొని సిద్ధంగా ఉన్నాడు. కానీ దుర్వాస మహర్షి రాలేదు అందరూ ఎదురు చూస్తున్నారు. ద్వాదశి ఘడియలు ముగియనున్నాయి. అయినా ఋషి రాలేదు. పెద్దలు భుజించకుండా ప్రసాదం స్వీకరించరాదు కానీ ద్వాదశి ఘడియలు దాటితే వ్రత భంగం అవుతుంది. నియమం తప్పక వ్రతాన్ని ఆచరించే అంబరీషునికి చాలా ఆందోళనగా ఉంది. బ్రాహ్మణ పెద్దలకు తన బాధను చెప్పుకున్నాడు. వారంతా ధార్మిక చర్చలు చేసి "జల పారణ" చేయమని సలహా ఇచ్చారు. అంటే ప్రసాదం తింటే అది ఉచ్ఛిష్టం అవుతుంది కనుక భగవంతుని తీర్థం పుచ్చుకొని వ్రత పూర్తి చేయవచ్చునని బ్రాహ్మణులు చెప్పారు. అంబరీషుడు అందుకు సిద్ధపడ్డాడు. అతన్ని ఇబ్బంది పెట్ట దలుచిన దుర్వాసుడు దివ్యదృష్టితో అంతా గమనించి సరిగ్గా సమయానికి వచ్చాడు. కోపంతో ఊగిపోయాడు తీర్థం స్వీకరించడంతో కూడా తనను అవమానించినట్లే అని శపించడానికి సిద్ధపడ్డాడు. పైగా మంచివాడైన అంబరీషుణ్ణి నానా మాటలు అన్నాడు. "అది ధర్మమే! మేమే అనుమతించాము!"అని బ్రాహ్మణులు ఎంత చెప్పినా అంబరీషునికి కీడు చేయాలనుకున్నాడు. కలత చెందిన అంబరీషుడు శ్రీమన్నారాయణుని ప్రార్థించాడు. వెంటనే ధగధగ మెరిసే కాంతులతో కండ్లు చెదిరే వెలుగుతో సుదర్శన చక్రం తిరుగుతూ వచ్చింది. అంబరీషుణ్ణి నిష్కారణంగా శిక్షించ దలచిన ఋషి పైకి సుదర్శనచక్రం వెళ్ళింది. అతని తపో బలం విష్ణు తేజం ముందు పనిచేయలేదు. ఆరుషి పారిపోవటం ప్రారంభించాడు. చెట్లు గుట్టలు నీళ్ల దట్టమైన అడవులు భవనాలు ఎక్కడికి వెళ్ళిన సుదర్శనచక్రం

## బాలవిజ్ఞానం



వెంబడిస్తూనే ఉంది. ఎక్కడికైనా వెళ్లగల సమర్థుడే కనుక కైలాసం శివుని వద్దకు వెళ్ళాడు. బ్రహ్మలోకం వెళ్లి బ్రహ్మను ప్రార్థించాడు కానీ లాభం లేకపోయింది. విష్ణు లోకం వెళ్లి ప్రార్థించాడు. అప్పుడు విష్ణుమూర్తి "సుదర్శనం ఇప్పుడు నా అధీనంలో లేదు నా భక్తుడైన అంబరీషుని అధీనంలో ఉంది నేను సుదర్శనచక్రాన్ని మళ్ళించ లేను" అన్నాడు. ఇక దుర్వాసుడు చేసేది లేక తన తప్పు తెలుసుకున్నాడు మంచి వారికి అపకారం చేయ రాదు. అపకారం ఎవరికి చేస్తామో వారినే ప్రార్థించాలి. అనే సత్యం తెలుసుకున్నాడు. తిరిగి అంబరీషుని వద్దకు వచ్చే ప్రార్థించాడు. అంబరీషుడు శ్రీ మన్నారాయణుని, సుదర్శనున్ని ప్రార్థించి చక్రాన్ని ఉపశమింప చేశాడు. దుర్వాసుని గర్వం తొలిగి భగవంతుని ప్రార్థించాడు. అందుకే మంచి వారికి అపకారం చేయ రాదు. సదాచారమే సంకటాల నుండి రక్షిస్తుంది. ★

# విష్ణు పురాణ ప్రాశస్త్యము

**(9 పేజీ తరువాయి)** 'ఏకోహవైనారాయణ ఆసీత్, నతత్సమశ్చాభ్యధికశ్చదృశ్యతే, తత్ర బ్రహ్మాచతుర్ముఖః అజాయత విరూపాక్షాయ బ్రహ్మణః పుత్రాయ " ఇట్లు శ్రుతులు ప్రతిపాదించిన నారాయణ పరత్వమునే తెలిపింది. నారాయణుడు పరతత్త్వము కాదనుటకు ప్రమాణములు లేవు కనుక విష్ణుపురాణం పరత్వాన్ని ప్రతిపాదించింది. స్వవచన వ్యాఘాతము లేనిది. (ఉపక్రమ, ఉపసంహార, అభ్యాసములలో) ప్రతి ప్రబంధమున మొదట ఆప్రబంధమున చెప్పబోవునటువంటి విషయము చెప్పబడుతుంది. మధ్యలో పలుమార్లు అదే విషయము బలపరచబడుతుంది. చివరకు ఉపసంహారమున అదేవిషయము చెప్పబడుతుంది.

విష్ణుపురాణమున అంతట నారాయణ పరతత్త్వమే చెప్పబడింది. దానికి విరుద్ధమగు అంశము లెక్కడా చెప్పబడలేదు. సూటిప్రశ్నకు సరి అగు సమాధానముతో ప్రారంభమైంది.

మైత్రేయుడు వేదాధ్యయనమును పూర్తి చేసికొని పరాశరునిచేరి తత్త్వనిర్ణయమునకు ఉపబృంహణముగా పురాణమును వినగోరి జగత్తునకు కారణమేది? అను సామాన్య ప్రశ్నరూపమున ప్రశ్నించాడు. విశేష రూపమగు విష్ణో స్సకాశాత్' అని సమాధాన పరచబడ్డాడు. నిష్పక్షపాతముగా శిష్యజిజ్ఞాసను శమింపజేయటానికి జరిగిన తత్త్వబోధ రూప పురాణము విష్ణు పురాణము. మైత్రేయుని ప్రశ్న. "సో2హమిచ్ఛామి సర్వజ్ఞ శ్రోతుం త్వత్తో యథా జగత్ బభూవ భూయశ్చ యథా భాగ భవిష్యతి."అని పరాశరుని సమాధానము. విష్ణోస్సకాశా దుద్భూతం జగత్త్రైవచ స్థితమ్ స్థితి సంయమ కర్తా2సౌ జగతో2స్య జగచ్చసౌ"కావున శ్రీమన్నారాయణుడే జగత్కారణము పరతత్త్వమని ప్రతిపాదించింది కావున పరాశరకృతి అగు శ్రీ విష్ణుపురాణము ప్రాశస్త్యము కలది.




# అభినందనలు

శ్రీసన్నిధాన ప్రతులు అందుకున్నవారికి అభినందనలు. శ్రీసన్నిధి పదకేళి నింపి శ్రీసన్నిధానం సంచికలు కావాలనుకున్నవారికి మేము సంచికలు ముద్రించి ఉచితంగా అందజేయడం జరిగింది. మాలక్ష్యం పాఠకుల అభిప్రాయాలను గౌరవించడమే. సనాతన సంప్రదాయ వెలుగులు దశదిశలా ప్రసరించేలా శ్రీసన్నిధానం చేస్తున్న ప్రయత్నానికి చేయూత నిచ్చిన వారికి కృతజ్ఞతాభినందనలు.

శ్రీసన్నిధానం ట్రస్ట్ ఆవిర్భావం తరువాత సంచిక ముద్రణ కార్యభారం వహించడానికి పోషకులకు అవకాశం ఇవ్వడం జరుగుతుంది. మీ వెంట మేమున్నాం అన్నవారికి శ్రీసన్నిధానం మే 2022 సంచిక పంపించాము. అందుకున్నవారు తమ స్పందన తెలియజేయండి!

పాఠకుల అభిప్రాయాలమేరకు కార్యాచరణ ఉంటుందనేది సుస్పష్టం. పదకేళి నింపి పంపినవారు కొందరు చిరునామాలు స్పష్టంగా ఇవ్వకపోవడం. శ్రీసన్నిధాన డాట్ ఓఆర్‌జి వెబ్‌సైట్‌లో సరిగా నమోదు చేయకపోవడం వల్ల వారికి ముద్రణ ప్రతిని పంపలేకపోయాము. ప్రతులు కావాలనుకున్నవారు వెబ్‌లో నమోదు చేసుకోవాలి. లేదా నేరుగా ఫోన్ ద్వారా కానీ వాట్సాప్ ద్వారా కానీ సంప్రదించవచ్చు.

**-మేనేజింగ్ ఎడిటర్**